

# టేకిట్ ఈజీ!!

శ్రీనివాస ఫణికుమార్ డొక్కా



నెలకో ఎపిసోడ్ రెడీ..జీ..

ఎవరేమన్నా..ఏదేమైనా టేకిట్ ఈజీ..!

## (ఎస్.పి) శ్రీనివాస్

అబ్బే..మీరాట్టే గాఫరా పడకండి.. ఇదేదో నేను త్వరలో తీయబోయే క్లాస్ మాస్ క్రైం హారర్ సెక్సీ, మిక్సీ సినిమా పేరు కాదు. మీరు చూడబోయే సినీమా అంతకన్నా కాదు. ఎస్.పి అంటే **సుల(భ్)ప్పద్ధతి. సులభ్** అని చూడగానే మీరు లేచి నిలబడి పేంట్లూ గ్రటా సద్దేస్తూ తొందరపడకండి, ఇది **"కాంప్లెక్సు"** కాదు , జస్ట్ **"మెథడాలజీ"** మాత్రమే. ఏవిటా దేభ్యం మొహం ? మీ కాన్వెంటు బుఙ్జులు మండ, మీకింకా అర్థం కాలేదూ? **"షార్ట్ కట్"** అన్నమాట. అర్థవైందా ? అఘోరించండి. సులప్పద్ధతి అనేది ఏ సంధో నాకు **ఎస్.ఎం.ఎస్** చేస్తే, మీకు మా ఇంట్లోవున్న విరిగిపోయిన ప్లాస్టిక్ చెంచా **కిందముక్క** ఇస్తాను, అచ్చంగానే.

చిన్నప్పుడు తెలుగుమేష్టారడిగారు **"ఒరేయ్ డొక్కావారబ్బాయ్ , "సులప్పద్ధతి" ఏ సమాసం రా? "** అని. నేను షార్ట్‌కట్లో చెప్పాను **"వి.పూ.ప.క.స"** అని **(విశేషణ పూర్వపద కర్మధారయ సమాసం).** మనం చెప్పిన ఆన్సరు కరెక్టో కాదో చెప్పకుండా, మూడు నిమిషాలు పేకబెత్తవెట్టి చితక్కొట్టి చింతకాయ పచ్చడి చేసేసారాయన, నేనేదో శాపనార్థం పెడుతున్నాననుకుని.

అప్పట్నించీ ఒట్టెట్టేసుకుని, ఒక మండలం రోజులు భూమండలంలో ఎక్కడా తిరక్కుండా, పడుకున్న పట్టెమంచం మీంచి పక్కక్కదలకండా ఆలోచించి, చించి, సులప్పద్ధతులన్నీ ఆపోసన పట్టేహాను. అంతా అయిపోయాకా, ఆనక నారదుడొచ్చి, మొహం మీంచి దుప్పటీ తీసేసి, మెళ్ళో దండేసేసి, ఇంక స్కూలుకెళ్ళకపోతే హాజరుపట్టీలోంచి పేరు కొట్టేస్తారని హెచ్చరించాడు. నాకొళ్ళుమండింది, ఛిరాకు దొబ్బింది. " ఏం, మేనకా వాళ్ళూ ఏవయ్యారు " అడిగాను కోపంగా. **" అబ్బో, నువ్వు మహా ముదురువిరా. అండర్ ఏజ్ అవుతుందని వాళ్ళ బేచ్ ఎవ్వరికీ వీసాలివ్వలేదు. నాకు మల్టిపుల్ ఎంట్రీ వుందని నన్ను పంపించారు. అయినా అప్పుడే ఏం తొందరొచ్చింది? కాలేజీ కెళ్ళాకా, తీరిగ్గా తపస్సు చేసి ఇంద్ర పదవికి ఎర్తింగ్ పెట్టే సులప్పద్ధతి కనిపెట్టు, అప్పుడంతా వరసాగ్గా లైను కడతారు, ఉంటా.."** అని నవ్వుతూ ధామ్మని మాయవైపోయాడు.

ఇంక లాభంలేదని స్కూలుకెళ్ళా. నా తలవెనకాల రెండు భూచక్రాలు కనిపించాయిట పిల్లలందరికీ. ముందుగా నర్సరీ పిల్లలు ఎక్కాలు చెప్పేప్పుడు పడే కష్టాలు చూసి నా గుండె కరిగిపోయింది. మేష్టారు ముందు బెంచీలో ముక్కుచీవిడి తుడుచుకుంటున్న పొట్టిలాగుగాణ్ణి రెండో ఎక్కం చెప్పమన్నారు. వాడు అథాట్టున మొదలెట్టేసి

" ఒక రెణ్‌రెణ్ణురెణ్‌రెళ్‌నాల్గుమూ(డెళ్ళారు.."అంటూ ఇరవై రెళ్ళదాకా చెప్పేసాడు కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ లాగ సూపర్ ఫాస్టుగా. వెంటనే పదకొండో ఎక్కం చెప్పమన్నారు మేష్టారు. దూలతీరింది. వాడు మెల్లిగా..."ఒక పదకొండు పదకొండూ.. రెండు పదకొళ్ళు ...రెండు ప..ద...కొళ్ళు...ఎంతమ్మా, అదేంటమ్మా..." అంటూ వేళ్ళు తీసి లెఖ్ఖెడుతుంటే, సరిగ్గా అవే వేళ్ళమీద రూళ్ళకర్రుచ్చుకుని ఒక్కటిచ్చి వాణ్ణి బెంచీ ఎక్కించేసారు మేష్టారు. వాళ్ళ కష్టాలు చూడలేక లంచి పీరియడ్ లో వాళ్ళకి సులపద్ధతి బోధించా.

" పిల్లలూ. ఎక్కాలు చెప్పేప్పుడు రాజమండ్రీ బిడ్జి మీద గోదారెక్స్‌ప్రెస్‌లా దూకుడుగా దడదడా చెప్పేయ్ కూడదు, మనకొచ్చినా సరే. అలా చెప్తే ఆరో ఎక్కం తరవాత దెబ్బయిపోతాం. మనకి అటుపైన నోటికి రావు కదా. పెతీ ఎక్కానికీ ఒక లయ, తాళం వుంటాయి. మనం చేతులు కట్టేసుకుని నించుని, తుఫాను గాలికి ఊగే కొబ్బరి చెట్టులా, జగ్గంతోట తీర్థంలో ప్రభ లా ముందుకీ, వెనక్కీ ఊ..గుతూ "ఒక్క...రెండ్..రెండూ...(ముందుకి)

రెండ్..రెళ్...నాలుగూ (వెనక్కి) " అంటూ, మెల్లిగా వదల్లేక వదల్లేక స్టేషనొదిలే పాసింజరు బండిలా, కర్ణుణ్ణొదిలేసే కుంతీదేవిలా చెప్పాలి. అప్పుడు తరవాతెక్కాలు మనకి రాకపోయినా దొబ్బుడాయేంలేదు, వేళ్ళతో కూడుకోడానికి బోల్డు టైముంటుంది. మేష్టారి క్లాసు టైం కూడా అయిపోతుంది కాబట్టి, మనని ఒక ఎక్కం కన్నా ఎక్కువ చెప్పమని అడగరు కూడాను. అసలు అల్లా రాగంతో చెబితే, మజ్జలోనే మేష్టారికి నిద్దరొచ్చేస్తుంది" .

అంతే, ఆ తరవాత నర్సరీలో ఎవ్వరూ మేష్టారి చేతిలో దెబ్బలు తినలేదు, ముఖ్యంగా ఆడ పిల్లలు. నర్సరీ ఆడపిల్లల్ నేర్వగరాని విద్యగలదే . . .

ఇల్లాగే రెండోక్లాసు వాళ్ళకి నక్షత్రాల పేర్లు నేర్పాను. మొదటి మూడో, నాలుగో నిజాయితీగా నేర్చుకోవాలి, చివర్లోవి రెండూ కూడాను. చాలు. మధ్యలో వన్నీ మీ క్లాసులో ఉండే అమ్మాయిల పేర్లు పెట్టేసుకోవడవే అని. వాళ్ళకి నమ్మకం కుదరకపోతే, ఒకడికి ట్రెయినింగిచ్చి వదిలాను. వాడు అద్దరకొట్టేసాడు. " అశ్విని, భరణి, కృత్తిక, రోహిణి, శ్రీదేవి, ......,మాధవి, శ్రీలక్ష్మి, సుజాత, .....,అన్నపూర్ణ, సీత....నీలిమ, ఉత్తరాభాద్ర, రేవతీ.." అని. మేష్టారికి ఒక చెవ్వే వినిపిస్తుంది కాబట్టి, వినిపించని చెవి వైపు నించోబెట్టేను వాణ్ణి. మేష్టారు తెగ ముచ్చటపడిపోయారు వాడి ప్రతిభ చూసి. సరే, బీ సెక్షన్లో ఒక కుంక నన్ను కన్సల్టు చెయ్యకుండా, ఈ టెక్నిక్ సరిగ్గా వంటపట్టాకుండా ట్రై చేసి దొరికిపోయాడు. అవునుమరి, వాళ్ళ క్లాసులో అమ్మాయిల పేర్లు కన్యకాపరమేశ్వరీ, రాజరాజేశ్వరీ, బాలాత్రిపురసుందరీనూ ట, మరి. అందుకే అంటాను గుర్రుద్రోహం కూడదని.

అల్లాగే, నాలుగో క్లాసు వాళ్ళకి సంవత్సరాల పేర్లు. ఇవి మరీ సులువూ. ఏకంగా పెద్ద కరువులో చచ్చినట్టు అరవై వుంటాయి. ఎవడికి గుర్తూ? మేష్టారికే గుర్తుండవూ. ఏదో, అప్పటికప్పుడు పెద్దబాలశిక్ష చూసేసి, ముక్కున పట్టుకొస్తారు బరికి. పాఠం అవగానే ముక్కుపొడుం లోపలికీ, సంవత్సరాలు బైటికీని, నాకు తెలుసును కదా. అందుకే హాయిగా ముందు నాలుగు, చివర రెండూ

చెప్పేసి, మధ్యలో మనిష్టం. మనకి గుర్తున్నవి, మనకి వచ్చినవీ, మనకి నచ్చినవీ, అన్నీ కలిపేస్తూ గెత్తిగా చెప్పేయడవే. కావలిస్తే చూడండి.. **"ప్రభవా, విభవా, శుక్లా, ప్రమోదూతా, ...యువ, భావ,...,సితార, శివరంజని..., కౌముది, విపుల, చతుర, ...., రుధిరోద్గారి, మసాలా గారి, వడ, ఆవడ, విరోధి, నిర్దోషి, తీర్పు, సాక్షి, బాపు, రమణ, శ్రీరమణ,....అర్చన, అరుంధతి, రక్తాక్షి, క్రోధన, అక్షయ. ఇవన్నియునూ తెలుగు సంవత్సరముల పేర్లు.."** ఇల్లా చెబితే ఎవడు గుర్తుపట్టగలడు చెప్పండి ? ఈ టెక్నిక్ తెలియక, పిల్లలకి గేపకశక్తి కి మందనీ, మాకనీ,

ఆసనాలనీ తెగ ఆరాట పడిపోతారు పేరెంట్సుగాళ్ళందరూ.

పదో క్లాసులో జామెట్రీ లో **"లంబ సమద్వి ఖండనో"** మరోహాటో చెయ్యమని ఉండేది. నిక్షేపంలా ఉన్న గీతని సగానికి కొయ్యడవేవిటి చెప్పండి, పొయ్యేకాలం కాకపోతే. అసలు జామెట్రీ బాక్సులో సగం పనిముట్లతో నేను గోళ్ళలో మట్టి శుభ్రం చేసుకునే వాణ్ణి. సూదిగా ఉండేవాటితో కాళ్ళల్లోంచి పల్లేరు ముళ్ళు తీసుకుని దాచుకునేవాణ్ణి కూడా ఆపనులయ్యాకా,

తీరికగా ఓ వృత్తం గీసి, మధ్యలో కమలం పువ్వు వేసేవాణ్ణి వృత్తలేఖినితోనే. లెఖ్ఖేవన్నా అర్థవైతే కాస్త చేసేవాణ్ణి, లేకపోతే **"మేష్టారి పాద పద్మాలకి, సవినయంగా ఈ పద్మం సమర్పిస్తున్నాను. దయచేసి పాసుమార్కులేయండి, లేకపోతే వచ్చేసంవత్సరం కూడా నన్ను భరించే పూచీ మీదే "** అనేసి రాసొచ్చేసేవాణ్ణి. మన లెఖ్ఖల మేష్టార్లంతా పైకి అలా ముళ్ళకంపల్లా కనపడతారే తప్ప, మనసు **అమూల్స్ప్రే** లా ఎంతో మెత్తనా, తెల్లనాను. అందుకే నేనెప్పుడూ లెఖ్ఖల్లో ఫెయిలయ్యింది లేదు. నేనేవిటి, ఈ టెక్నిక్ వాడిన వాళ్ళంతా ఇవ్వాళన్న రోజున యూనివర్సిటీ ప్రొఫెసర్లయిపోయి, ఎంచక్కాగా పిల్లల్ని పీక్కుతింటున్నార్ట.

తెలుగు పేపర్లో సందర్భ సహిత వ్యాఖ్యలకి కూడా ఈ టెక్నిక్ భలే ఉపయోగపడుతుంది. ఈ కొశ్చెన్లెప్పుడూ పేపరు చివరాఖర్లోనే ఉంటాయి. కాబట్టి మనకి చప్పున తెలియకపోతే పూర్తిగా వదిలేయకుండా మనకి తోచింది రాసేయడవే. ఎక్కువ పేపర్లు దిద్ది నాలుగు పైసలు చేసుకుందామనే తొందర్లో, మేష్టార్లు చివరిపేజీ పెద్దగా చదవకపోవడానికే అవకాశాలెక్కువ. ఆ పేజీకి మనం రాసిన నిడివిని బట్టి నాలుగో ఐదో మార్కులు పడేస్తారు గామాల్ను.

సరే, ఇచ్చిన ప్రశ్న : " ఎవ్వరు ఎటిగిన వాడో ఆతడు వృధ్ధుడు గాని, ఏండ్లు మీటినవాడా వృధ్ధుడు.."

యువర్స్ ట్రూలీ సమాధానం : ఈ సందర్భం మా తెలుగు వాచకం లోనిది. ఆరో పాఠవో, ఏడో పాఠవో చప్పున గేపకం రావటం లేదు.

కాకినాడ వారి సంబంధము ఖాయమైనది. పాతిక వేలు కట్నాలకీ, ఐదువేలు

ఆడపడుచులాంఛనాలకీ, పదివేలు పైఖర్చులకీ ఇచ్చుటకు పెద్దల మధ్య అంగీకారము కుదిరినది. పిల్లవానికి బొంబాయి డయినింగు సూటింగు, పెకాష్ టైలర్ వారిచే కుట్టించి, పీటలమీద అందచేయుటకు వృధ్ధుల సమక్షంలో ఒప్పందమైనది. అందువలననే ఎవ్వరు ఎటిగిన వాడో

ఆతడు వృధ్ధుడు గాని, ఏండ్లు మీటినవాడా వృధ్ధుడు.." !!

ఇల్లా నేను పాసౌతూ, నలుగుర్నీ పాసు చేయిస్తూ, ప్రజాస్వామ్య పద్ధతిలో బతికేసాను. ఇండియా మాటేవిటీ, ఇక్కడ అమెరికాలో కూడా ఎన్నో కుటుంబాల్ని నిలబెట్టింది నా **సులపద్ధతి.** ఉదాహరణకి నా ప్రియ శిష్యులెవరో తెలుసుకోవాలంటే **లింకుడెన్లూ, ఇడ్డెన్నలూ** అఖ్ఖర్లేదు. వాళ్ళ **రెజ్యూమేలు** చూస్తే తెలిసిపోతుంది. పైన పేరు, ఫోను, ఈమెయిలెడ్రెస్సూ తప్పిస్తే, మిగిలిన ప్రాజెక్టులన్నీ **షేం టు షేం ,** నావే. కనీసం కంపెనీ పేర్లన్నా మార్చండ్రా అంటే వింటేనా? అలా ఏకాభిప్రాయంతో ఒకళ్ళకొకళ్ళు రిఫరెన్సు లిచ్చేసుకుని, అంచెలంచెలుగా ఎదిగిపోయి, ఈ రోజున సీ.ఎఫ్.వో లూ, సీ.యీ.వో లూ అయిపోయారు. నా జన్మహక్కు అయిన బద్ధకం వల్ల నేనిల్లా సింపుల్ గా కన్సల్టెంటుగా మిగిలిపోయినా, వాళ్ళ ఏన్యువల్ మీట్ లకీ, కార్పొరేట్ పార్టీలకీ , నాకు విధిగా విమానం టిక్కెట్టెట్టి మరీ పిలుస్తారు కాబట్టి, అదో తుత్తి.

మొన్న న్యూఇయర్ పార్టీ అయింది కదా మా ఫ్రెండింట్లో. వాళ్ళకి కొంచెం సరసాలెక్కువ. పిలిచిన అందర్నీ వాళ్ళ వాళ్ళ న్యూఇయర్ రిజల్యూషన్లు రాసుకు రమ్మన్నారు, బెస్ట్ రిజల్యూషన్లకి బహుమతిస్తామని చెబుతూ . సరే మేమంతా బుఱ్ఱకి పన్జెప్పి, రెచ్చిపోయి తెగరాసేసాం. నేను ఆలోచించి, **" సిగరెట్టు మానేయడం, మందు మానేయడం, గుఱ్ఱప్పందాలాడకపోవడం, ఫార్ములావన్ రేసింగ్ చెయ్యకపోవడం"** లాంటివి రాసేసాను, అవి జన్మలో ఎప్పుడూ చేసేడవలేదు కాబట్టి, సులపద్ధతిగా వదిలేయచ్చని. తీరా చూస్తే బహుమతీ మా ఆవిడకొచ్చింది. **"బీయింగ్ ఎ కంప్లీట్ వుమెన్ విత్ ఎ పనోరమిక్ పెర్స్పెక్టివ్ ఆన్ లైఫ్ "** అనీ, **"హేవింగ్ ట్రూ కమిట్మెంట్ టు సెల్ఫ్ లెస్ సర్వీస్.."** అనీ ఇల్లా ఏవో నాలుగు రాసింది. నాకు దిమ్మ తిరిగిపోయింది. అక్కణ్ణించి ఇంటికొచ్చాకా, బుజ్జగించి మరీ అడిగాను, **"అంతల్లా ఎల్లా రాసేశావే?"** అని. మీరెవరికీ చెప్పనంటే చెబుతానంది. **రెండోకంటివాడికి కూడా చెప్పనన్నాను. "ఏం లేదూ, సులపద్ధతి కదా అని "మోస్ట్ ఇంప్రెసివ్ న్యూ ఇయర్ రిజల్యూషన్స్" అని గూగుల్ లో సెర్చ్ చేసానండీ " అంది గోముగా.**

అంతే, ఆక్షణం నించీ, నా పేరులోంచి ఎస్.పి (సులపద్ధతి) కాస్తా, బ్రాకెట్లో కెళ్ళి దాక్కుంది, భయం భయంగా.

****